www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 జూన్ 2024
5
తిరుపతి

వ్యవసాయ డిప్లొమా కోర్సుకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే వ్యవసాయ డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు తిరుపతి వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా. సి. రమణ తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు పదో తరగతి విద్యార్హత అని వివరించారు. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2024 ఆగస్ట్ 31 నాటికి 15 నుంచి 22 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. గ్రామీణప్రాంతాలలో ఇంగ్లీష్ చదివిన వారికి , మున్సిపాలిటి పరిధిలో చదివిన వారికీ 75:25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. జూన్ ఒకటి నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ సందర్శించాలని ఆయన సూచించారు. ఆన్లైన్ రెజిస్ట్రేషన్, ఇతర వివరాలకు కోసం 0877-2249909, 9618167187 సంప్రదించాలని ఆయన కోరారు.



ఏ తీరుగ దయ చూపెదవో..!

'ఇంకా తెలవారదేమి.. ఈ చీకటి విడిపోదేమి..' అంటూ రాత్రంతా జాగారం.. రెండు నెలల పాటు ప్రచార పర్వం, మే 13న పోలింగ్ ప్రక్రియ.. వెరశి అభ్యర్థుల భవితవ్యం మంగళవారానికి తేలనుంది.. మధ్యాహ్ననికే టిడిపి కూటమా, వైసిపినా అన్నది స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జిల్లావ్యాప్త ప్రథమ, ద్వితీయ నాయకత్వమంతా తిరుపతి హోటళ్లు, లాడ్జీలలో తిష్ట వేసింది. ఎలక్షన్ కమిషన్ కౌంటింగ్ ప్రక్రియను చాలా సీరియస్‌గా తీసుకున్న నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు ఓటముల ప్రక్రియ నరాలు తెగే ఉత్కంఠతో సాగనుంది. ఎంఎల్ఎ అభ్యర్థి వంద కోట్లు, ఎంపి అభ్యర్థి సైతం దాదాపు అదే స్థాయిలో డబ్బులు వెదజల్లారు.. వైసిపి 'సంక్షేమాన్ని' నమ్ముకుంది. టిడిపి కూటమి 'అధికార పార్టీపై వ్యతిరేకతను' పెంచి పోషించింది. ఈ నేపథ్యంలో ఓటరు మహాశయ గుంభనంగా వేసిన ఓటు 'తీర్పు' నేడే తేలనుంది. అభ్యర్థుల్లోనే కాదు, సాధారణ జనంలోనూ ఒకటే టెన్షన్.. గెలుపు ఎవరిది..? అన్నదే అంతటా చర్చ. అభ్యర్థులు మాత్రం 'ఏ తీరుగ నను దయచూపెదవో' అంటూ ఈవిఎంలను భక్తితో కొలుస్తున్నారు.

చంద్రగిరిలో భారీగా మద్యం, మారణాయుధాలు స్వాధీనం

ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి)

కర్ణాటక రాష్ట్రం నుండి టెంపో ట్రావెలర్ వాహనంలో కర్ణాటక మద్యాన్ని తిరుపతికి తరలిస్తుండగా పట్టుబడింది. సోమవారం చంద్రగిరి సీఐ ఎం రామయ్య ఆధ్వర్యంలో చంద్రగిరి జాతీయ రహదారి వద్ద చంద్రగిరి పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా తనిఖీలు చేస్తుండగా భారీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనంలో మరణాయుధాలు ఉన్నట్లు స్థానికులు అంటున్నారు.. దీంతో మద్యం, మారణాయుధాలు ఎవరు తీసుకు రమ్మంటే తీసుకొచ్చారు....? ఎందుకోసం తీసుకొచ్చారు....? ఎక్కడికి తరలిస్తున్నారు....? అనే కోణంలో చంద్రగిరి పోలీసులు విచారిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ తిరుపతిలో మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా హింసాత్మక దాడులు చేపట్టేందుకు కుట్రలో భాగంగానే ఈ తరలింపులు జరుగుతున్నాయని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం పోలీసులకు చాలెంజ్గా మారింది. అయితే పట్టుబడిన మారణాయుధాలు, మద్యం మత్స్యకారులకు సంబంధించినదని, వీరంతా నెల్లూరుకు చెందిన వారని పోలీసులు చెబుతున్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని పేర్కొన్నారు.

మహిళా యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ భద్రత

ఈవిఎం కౌంటింగ్ నేడే

ఉదయం 8 గంటలకే కౌంటింగ్
అందరిలోనూ నరాలు తెగే ఉత్కంఠ
జోరుగా బెట్టింగుల జోరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్‌లకు సంబంధించి మే 13న పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ దేశవ్యాప్తంగా మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియతో ప్రారంభం కానుంది. తిరుపతి జిల్లాలో 19,503 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 15 టేబుళ్లలో కౌంట్ చేయనున్నారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి 22,957 ఓట్లు 20 టేబుళ్లలో లెక్కించనున్నారు. కౌంటింగ్ సిబ్బంది సమయానికి రాకపోతే సస్పెన్షన్ తప్పనిసరి అని ఎన్నికల అధికారి హెచ్చరించారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి తిరుపతి బైపాస్‌రోడ్డులోనూ ఆర్‌విఎస్ మెడికల్ కాలేజీ, తిరుపతి సంబంధించి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశారు. ఏర్పాట్లను పోలింగ్ ముగిసినప్పటి నుంచి జిల్లాల ఎన్నికల అధికారులు షన్మోహన్, ప్రవీణ్‌కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. చిత్తూరులో 912మందిని కౌంటింగ్ విధులకు ఉపయోగిస్తున్నారు. తిరుపతి అత్యంత సమస్యాత్మకం కావడంతో 2,500 మందిని అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లుగా ఉన్నారు. తిరుపతి జిల్లాలో తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరితో పాటు తిరుపతి పార్లమెంట్ కౌంటింగ్ జరగనుంది. సత్యవేడు ఫలితం మొదటగా రానుంది. చివరగా చంద్రగిరి అసెంబ్లీ రానుంది. తిరుపతి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకూ 133 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఒక్క తిరుపతిలోనే 46 మంది పోటీ చేశారు. 26 మంది తిరుపతి పార్లమెంట్‌కు ఉన్నారు. చిత్తూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 96 మంది బరిలో ఉన్నారు. పార్లమెంట్‌కు 19 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల్లో ప్రధానంగా వైసిపి, టిడిపి కూటమి, ఇండియా ఫోరం వేదిక మధ్య పోటీ నెలకొంది.

ర్యాండమైజేషన్ పూర్తి

జూన్ 4న కౌంటింగ్ చేపట్టనున్న నేపథ్యంలో సిబ్బందికి రెండో ర్యాండమైజేషన్ పూర్తయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ విసి హాల్ నందు కౌంటింగ్ అబ్జర్వర్లు ఉజ్వల్ కుమార్ ఘోష్ (తిరుపతి, సూళ్లూరుపేట నియోజక వర్గం), కైలాస్ వాంఖడే (చిత్తూరు పార్లమెంట్ చంద్రగిరి నియోజక వర్గం), జ్యోతి(గూడూరు, సత్యవేడు నియోజకవర్గం), డా. జ్యోత్స్న విద్యాసాగర్ హిరాముఖే పడియార్ (వెంకటగిరి, శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజక వర్గాలు) శిక్షణ పూర్తయ్యింది.

తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ పర్యవేక్షణ

'గీత'దాటితే 'తాటే'

తిరుపతి, చిత్తూరు ఎస్పీల హెచ్చరిక
అంతటా 144 సెక్షన్,30 యాక్ట్
భారీగా మద్యం, ఆయుధాలు స్వాధీనం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

దేశవ్యాప్తంగా కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు ఉత్కంఠ రేపుతున్న నేపథ్యంలో ఎలాంటి హింస జరగకుండా చిత్తూరులో మూడంచెలు, తిరుపతిలో నాలుగంచెల భద్రత కల్పించినట్లు ఎస్పిలు విఎన్ మణికంఠ చందోలు, హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. అంతటా 144 సెక్షన్, పోలీసు 30 యాక్ట్ అమల్లో ఉంటుందని, ఎలాంటి హింస జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా 'గీత' దాటితే తాట తీసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని, శాంతిభద్రతత పరిరక్షణే ధ్యేయంగా కౌంటింగ్ విధులు నిర్వహించనున్నామని చెప్పారు.

చిత్తూరు జిల్లాకు సంబంధించి ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ ఓట్ల లెక్కింపు బైపాస్‌రోడ్డులోని ఆర్‌విఎస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేశారు. తిరుపతి జిల్లా ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్‌కు సంబంధించి పద్మావతి మహిళా యూనివర్సిటీలో కౌంటింగ్ నిర్వహించనున్నారు. వాట్సాప్‌లో ప్రేరేపించే మెసేజ్‌లు పెడితే అడ్మిన్లపై కేసు పెడతామని డిజిపి హరీష్‌కుమార్ గుప్త హెచ్చరించారు. కౌంటింగ్ రోజు హింసకు పాల్పడినా, ప్రేరేపించినా గుర్తించినవారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. చిత్తూరులో 2వేల మంది, తిరుపతిలో 3వేల మందితో కౌంటింగ్ బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గాల్లో అల్లర్లు, గొడవలు జరగకుండా ప్రత్యేక పారామిలటరీ, స్ట్రైకింగ్ ఫోర్స్‌లను రంగంలోకి దింపారు. కర్నాటక, తమిళనాడుల్లో కేవలం పార్లమెంట్ కౌంటింగ్ మాత్రమే ఉండడంతో, అక్కడ నుంచి సైతం పోలీసులను బందోబస్తుకు ఉపయోగిస్తున్నారు. పాస్‌లున్న ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామని, పాస్‌లు లేనివారు కౌంటింగ్ కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండాలని, చుట్టుపక్కల షాపులు, రవాణా ఉండరాదన్నారు. భద్రతా ఏర్పాట్లలో అన్ని నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, మాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు,ఎన్ఐసి డిఐఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏజెంట్స్ వద్ద ఉండాల్సిన ఫామ్స్ ఇవే!

మంగళవారం జరిగే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్స్ వద్ద ఉండాల్సిన ఫామ్స్

ఫామ్-17: ప్రతి బూత్‌లో పోలింగ్ పూర్తయిన తర్వాత ఎన్ని ఓట్లు పోలయ్యాయనే వివరాలతో పీవో సంతకం చేసి పార్టీల ఏజెంట్లకు ఇచ్చే పత్రం. వీటిని కౌంటింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలి.

ఫామ్ 18: ఇది కౌంటింగ్ ఏజెంట్ నియామక పత్రం. ఆర్వో జారీచేసిన ఈ సర్టిఫికెట్ ఉంటేనే ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు.

సుప్రీంకోర్టులో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిటీషన్ కొట్టివేత

ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి)

చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చంద్రగిరి నియోజకవర్గంలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. చంద్రగిరి నియోజకవర్గంలో ఫారం 17ఏ, ఇతర డాక్యుమెంట్ల విషయాన్ని మరోసారి పరిశీలించాలని ఆ పిటిషన్ లో కోరారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం ఎన్నికల పక్రిృయలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిలో జోక్యం చేసుకునేందుకు అవసరమైన కారణాలేమీ కనిపించడం లేదని కోర్టు అభిప్రాయపడినట్లు సమాచారం. పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో నాలుగు పోలింగ్ బూత్‌లో అక్రమాలు జరిగాయని మోహిత్ రెడ్డి తన పిటిషన్‌లో నమోదు చేసారు, అయితే హైకోర్టు ఆ పిటిషన్ ను కొట్టివేయడం హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా మోహిత్ రెడ్డికి చుక్కెదురు కావడం గమనార్హం.

సిబ్బంది ఆలస్యంగా వస్తే సస్పెన్షన్ : జేసీ

చిత్తూరు అర్బన్ : జిల్లాలో నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు సిబ్బంది ఆలస్యంగా వస్తే సస్పెండ్ చేస్తామని జేసీ శ్రీనివాసులు హెచ్చరించారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి ఓట్లు లెక్కింపుకు 14 టేబుల్స్ ద్వారా 17 రౌండ్లు పూర్తవుతుందని, కౌంటింగ్ టేబుల్స్ కు 19 మంది సూపర్వైజర్లు, 25 మంది అసిస్టెంట్ సూపర్వైజర్లు, 22 మంది సూక్ష్మ పరిశీలకులు, చిత్తూరు పార్లమెంటరీ సెగ్మెంట్ కి సంబంధించి 14 టేబుల్స్‌ను, 16 మంది సూపర్వైజర్లు, 17 మంది అసిస్టెంట్ సూపర్వైజర్లు, 19 సూక్ష్మ పరిశీలకులు నియమించడం జరిగింది అని తెలిపారు. ఈ సమావేశంలో డీటీలు హిమగిరి, కిరణ్, ధనంజయులు పాల్గొన్నారు.

గంధమనేని పారిజాతమ్మ మరణం తీరనిలోటు

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

ప్రజాశక్తి - పిచ్చాటూరు

తొలితరం కమ్యూనిస్టు నేత, పుత్తూరు మాజీ శాసనసభ్యులు గంధమనేని శివయ్య సతీమణి గంధమనేని పారిజాతమ్మ మరణం ఉద్యమానికి తీరని లోటని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. చెన్నయ్‌లో సోమవారం గంధమనేని పారిజాతమ్మ పార్థివ దేహానికి నారాయణ నివాళి అర్పించారు. పారిజాతమ్మ (84) వృద్ధాప్యరీత్యా ఆదివారం సాయంత్రం చెన్నయ్‌లో మృతిచెందారు. గంధమనేని శివయ్య, పారిజాతమ్మ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం వద్ద చక్కెర పరిశ్రమ రావడానికి గంధమనేని శివయ్య ప్రధాన భూమిక పోషించారన్నారు. న్యాయవాదిగా పనిచేశారని, సిపిఐ తరపున పుత్తూరు శాసనసభ్యులుగా ఉన్నారన్నారు. గంధమనేని పారిజాతమ్మ కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో అండగా నిలిచారన్నారు. పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన గంధమనేని శివయ్య1970 దశకంలో సిపిఐలో కీకల నేతగా వ్యవహరించారు. 1972-77 మధ్యకాలంలో పుత్తూరు ఎంఎల్‌ఏగా పనిచేశారు. ఈ దంపతులకు కుమారుడు గౌతమ్, కుమార్తె విజయలక్ష్మి ఉన్నారు. పారిజాతమ్మకు నివాళి అర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, రాష్ట్ర సమితి సభ్యులు డాక్టర్ టి.జనార్ధన్, సీనియర్ నాయకులు బి.తులసేంద్ర, నాయకులు చిన్నిరాజ్, సుధాకర్‌రెడ్డి, నాగేంద్ర, ఎం.ప్రసాద్ ఉన్నారు. ఆమె అంత్యక్రియలను సోమవారం సాయంత్రం చెన్నయ్ కోడంబాక్కం ఎన్‌టిఆర్ స్ట్రీట్‌లోని స్వగృహంలో నిర్వహించినట్లు కొడుకు గౌతమ్ తెలిపారు. పారిజాతమ్మ మాజీ ఎంఎల్‌సి జయచంద్రనాయుడికి సోదరి కావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా హ్యాండ్ లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ కె.కళ్యాణ్ చక్రవర్తి, ఉమ్మడి చిత్తూరు డీసీసీ బ్యాంకు జిల్లా మాజీ అధ్యక్షులు జి. హరీష్ నాయుడు, సీపీఐ జిల్లా నేత రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నిరాజ్, పిచ్చాటూరు మాజీ జడ్పీటీసీ సభ్యులు జి.బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సృజనాత్మకత

వేమన విజ్ఞాన కేంద్రం సమ్మర్ క్యాంప్ ముగింపు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపులో పాల్గొన్న పిల్లల్లో సృజనాత్మకత వెల్లివిరిసిందని వక్తలు ఉద్ఘాటించారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడితే పిల్లల్లో నిగూఢంగా ఉన్న అనేక సామర్థ్యాలు బయటకు వస్తాయన్నారు. 200 మందికి పైగా పిల్లలు, తల్లిదండ్రులు ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొన్నారు. మ్యూజిక్, పాటలు, ఆటలు, వ్యాసరచన, చిత్రలేఖనం, చెస్, కర్రసాము తదితర విభాగాల్లో శిక్షణ ఇచ్చారు. సోమవారం ముగింపు కార్యక్రమం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. మేధావులు డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల, మట్టా పురుషోత్తం, సోము రవి ప్రసంగిస్తూ పసిపిల్లలే యాంకరింగ్ చేస్తూ కార్యక్రమం రూపకల్పన చేసి వివిధ రూపాల్లో ప్రదర్శనలు ఇవ్వడాన్ని ప్రశంసించారు. జానపద, శాస్త్రీయ, నృత్య పోటీలు అద్భుతంగా నిర్వహించారని పిల్లల్ని అభినందించారు. ఈ సందర్భంగా మాస్టర్ మునిరాజు వద్ద నేర్చుకున్న కర్రసామును ప్రదర్శించారు. ప్రముఖ చిత్రకారులు కిరణ్‌కుమారి, అర్చన, భువనేశ్వరి, గాయత్రి పిల్లలచే వేయించిన చిత్రాలను ప్రదర్శింపజేశారు. వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుంచి జూన్ 2 వరకూ సమ్మర్ క్యాంపు వివిధ రంగాల్లో నిష్ణాతులైన గురువుల కృషి వల్ల పిల్లలు బాగా రాణించారన్నారు. గురువులను విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు టెంకాయల దామోదరం, నడ్డినారాయణ, మునిలక్ష్మి, గురునాథం, ఒ.వెంకటరమణ, రఫి తదితరులు మెమొంటోలు ఇచ్చి సత్కరించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు యుగంధర్‌బాబు, అరుణ్ శివప్రసాద్, గిరిధర్ మూర్తి, బిర్లానాయుడు పిల్లలకు సర్టిఫికేట్లు అందజేశారు.

నెలరోజుల పాటు శిక్షణ పొంది సర్టిఫికెట్ తీసుకున్న చిన్నారులు, నిర్వాహకులు

నోటీసులు లెక్క చేయని కబ్జాదారులు

నిషేధిత జాబితా భూమిలో అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీ మంగళం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వేనెంబర్ 31లో గల రెండు ఎకరాల 65 సెంట్లు భూమిని ప్రభుత్వం నిషేధిత జాబితా(22ఎ)లో చేర్చింది. గతంలో సదరు సర్వే నెంబర్లో భూ క్రయవిక్రయాలు జరిగి రిజిస్ట్రేషన్లు కూడా నడిచాయి. అయితే సదరు సర్వే నెంబర్లు గల భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని, అందుకు సంబంధించి ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని తిరుపతి అర్బన్ మండల తాహశీల్దార్ నాలుగు రోజులకు మునుపు పంచాయతీ కార్యదర్శికి మెమో, నోటీసులను జారీ చేశారు. దీనిపై నిషేధిత జాబితాలో ఉన్న స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని, చేపట్టిన నిర్మాణాలను అక్రమ నిర్మాణంగా పరిగణించి కూల్చివేస్తామని ఇప్పటికే పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్ సదరు అక్రమ నిర్మాణదారుడు వెంకటేష్ రెడ్డి కి నోటీసులు పంపారు. అయినా అధికారుల ఆదేశాలను ఏమాత్రం ఖాతరు చేయకుండా అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్ తెలిపారు.

నాడు నేడు పనులను పరిశీలిస్తున్న తిరుపతి జిల్లా సెక్టోరియల్ అధికారులు

నాడు- నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని లక్ష్మీపురం పాఠశాలలో నాడు - నేడు పనులను తిరుపతి జిల్లా సెక్టోరియల్ అధికా రులు సోమవారం పరిశీలిం చారు. ఇందులో భాగంగా లక్ష్మీపురం ఎంపిపి పాఠశా లలో డ్రింకింగ్ వాటర్ సంపు నిర్మాణాన్ని పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నాడు నేడు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. మండల విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీరామచంద్రారెడ్డి, ఐఇ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, మండల విద్యాశాఖ శాఖధికారులు, కె రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, ప్రధానో పాధ్యాయులు సతీష్ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలపై సర్వే

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: సున్న నుండి 18 సంవత్సరాల లోపు ప్రత్యేక అవసరాలు కలిగిన ప్రతి భావంతుల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాలలో చేర్పించేందుకు సర్వే నిర్వహిస్తున్నామని తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష విద్య కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో చేపట్టిన ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లల సర్వేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల పిల్లల తల్లిదండ్రులను కలిసి భవిత కేంద్రాలలో పిల్లలకు కల్పిస్తున్న విద్యా విధానం, ఇతర సౌకర్యాలను గుర్తించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, అయ్యప్ప రెడ్డి పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్చుకుంటున్న ఉపాధ్యాయులు

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి: ఎంఈఓ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో రవీంద్రనాథ్ పేర్కొన్నారు. మండలంలోని వేణు గోపాలపురం హెచ్‌డబ్ల్యు పాఠశాల, కారణమిట్ట హెచ్‌డబ్ల్యు పాఠశాలలో ఎంఈవో ఆధ్వర్యంలో సోమవారం బడిబాటను నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఒకటవ తరగతి నుండి ఆరో తరగతి లోపు పిల్లలను బడిలో చేర్పించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు బడిబాట పిల్లలుగా గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని, బడి బయట పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ప్రధానోపాధ్యాయులు రామదాసు, నెలవాయి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర రెడ్డి, పురుషోత్తం, పాఠశాల సిబ్బంది, సిఆర్పిలు పాల్గొన్నారు.

గోపి రాయల్‌ను సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు

బలిజ సంఘం నాయకులు గోపి రాయల్‌కు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు బలిజ సంఘం నాయకులు పి గోపి రాయల్ 54వ జన్మదినం సందర్భంగా పుత్తూరు బలిజ సంఘం నాయకులు ఆధ్వర్యంలో సోమ వారం ఘనంగా సన్మానిం చారు. ఆ సంఘం అధ్యక్షుడు పసుపులేటి శివ, గౌరవ అధ్యక్షుడు కొట్టే రాజేంద్ర, కోశాధికారి ఎం హేమాద్రి, సంఘ నాయకులు కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ప్రజల కోసం, బలిజ సంఘం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జి కృష్ణయ్య, ఎస్ జయ బాబు, పూల సుధ, జి గోపాల్, గొల్లపల్లి గోపి, గట్టు మురళి, ఎం రామ్మూర్తి, తదితరులు గోపి రాయల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత గంగాధరనెల్లూరు జట్టు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ప్రవీణ్ క్రికెట్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో గంగాధరనెల్లూరు జట్టు విజేతగా నిలిచి ంది. రన్నర్స్‌గా పూతలపట్టు జట్టు, కడప గుంట జట్టు మూడో స్థానంలో రాణిం చిన జట్టులకు గంగాధర నెల్లూరు హై స్కూల్ గ్రౌండ్లో విజేతలకు టోర్నమెంట్ నిర్వాహకులు ప్రవీణ్, టిడిపి పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణమనాయుడు, పార్లమెంట్ ఎస్‌ఎసి ఎల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్‌తో కలిసి టిడిపి రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు బహుమతులు అందజేశా రు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ10 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలును అందజేశారు. నేతలు కిషన్ చంద్, నియాజ్ అలీ, దేవరా జులు, విజయకుమార్ రెడ్డి, పుష్పరాజ్, జీవరత్నం, శాంత కుమార్ పాల్గొన్నారు.

144సెక్షన్ కఠినతరం.. ప్రశాంతత కోసమే..

ఎస్ఐ రాజకులాయప్ప

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం:

ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ రాజాకులాయప్ప హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 144సెక్షన్, పోలీస్ 30యాక్ట్ కఠినంగా అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. పోలీసుల చర్యలకు ప్రజలందరూ సహకరించి ప్రశాంతంగా ఉండేలన్నారు. కవ్వింపు చర్యలు, గొడవలు వంటివాటికి ప్రేరేపిస్తే కఠినమైన సెక్షన్లతో కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

కూలీలకు వడదెబ్బ సాయం పొందడం ఎలా?

పోస్టుమార్టం, వైద్యాధికారి నివేదిక కీలకం

ప్రజాశక్తి - ఓజిలి : ఈ ఏడాది వేసవి ఎండలు మండుతున్నాయి. భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఎండ తీవ్రతకు జనం బెంబేలెత్తుతున్నారు. వృత్తి దారులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి వేతనదారులు, శ్రామికులు, రైతులు జీవనోపాధికోసం ఎండను సైతం లెక్క చేయకుండా పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే ఆ కుటుంబం కోలుకోలేని విధంగా నష్టపోతుంది. ఇలాంటి సమయాల్లో ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్ట పరిహారం పొందాలంటే అవగాహన అవసరం. వడదెబ్బకు గురవుతున్న వారిలో ఎక్కువగా పేదవారు ఉంటున్నారు. వీరిలో చాలా మందికి నష్ట పరిహారం ఎలా పొందాలో అవగాహన లేదు. ఇలాంటి వారికి నిపుణులు పలు సూచనలు అందిస్తున్నారు. వడ దెబ్బకు గురైతే ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు చేస్తుంది. దీనికి సంబంధించి ప్రతి మండలానికి ఒక కమిటీ ఉంటుంది. ఆ కమిటీ వడదెబ్బకు గురై చనిపోయిన వారి వివరాలు నివేదికను కలెక్టర్‌కు పంపిస్తుంది. ఆయన పరిశీలించి పరిహారాన్ని విడుదల చేస్తారు. వడదెబ్బ తగలకుండా కూలీలు, డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలని, టోపీలు, హెల్మెట్, గొడుగులు వినియోగించు కోవాలి.

ఎవరిపై ఎక్కువ ప్రభావం

60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, చిన్నారులు, క్రీడాకారులు, గర్భిణులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయులు, మద్యం ఎక్కువగా తాగేవాళ్లు, అతిగా ఔషధాలు తీసుకొనేవారు సైతం జాగ్రత్తగా ఉండాలి. వేసవిలో ఎక్కువ సమయం ఎండలో పనిచేసే కూలీలు, కార్మికులు, ఉద్యోగులు చాలా జాగ్రత్తగా ఉండాలి.

వడదెబ్బ లక్షణాలు

శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శరీరం అదుపు తప్పుతుంది. నీరసంగా అనిపిస్తుంది. కొందరికి కళ్లు లాగుతాయి. తలనొప్పి వస్తుంది. వడదెబ్బ ప్రభావం ఎక్కు వగా ఉంటే వాంతులు, విరేచనాలు ఏర్పడతాయి. శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. జ్వరం ఏర్పడుతుంది. దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

సభ్యులుగా అధికారులు

మరో వైపు ఎండ తీవ్రతకు ఉపాధి హామీ వేతన దారులు, శ్రామికులు, రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలి. కారు, ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు ఎండలోనే తిరగడం వల్ల డిహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. వడదెబ్బ మృతుల నిర్ధారణ కమిటీలో మండల వైద్యాధికారి, తహశీల్దారు, సబ్ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉంటారు. వడదెబ్బతో మరణం సంభవిస్తే కమిటీ సభ్యులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలి. ఆ వ్యక్తి వడ దెబ్బతో మృతి చెందినట్లు ముందుగా వైద్యాధికారి ధ్రువీకరించాలి. అనంతరం పోలీసులు కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి సమీపంలోని ఆస్పత్రికి మృత దేహాన్ని తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తారు. ఆ నివేదిక వైద్యాధికారి పోలీసులు ఎఫ్ఐఆర్ ఆధారంగా వడదెబ్బ మృతిగా నిర్ధారిస్తారు. ఈ నివేదికను మండల తహశీల్దారు ద్వారా ఆర్‌డివోకు, అక్కడ నుంచి కలెక్టర్ కార్యాలయానికి నివేదికను సమర్పిస్తారు.

పరిహారంతో ఆసరా

వడదెబ్బ తగులుతున్న వారిలో అధిక శాతం కూలి పనులకు వెళ్లే వారు ఉన్నారు. అనుకోకుండా వీరు మరణిస్తే వడదెబ్బ పరిహారం గురించి అవగాహన లేకపో వడంతో సమాచారం అందించ లేకపోతున్నారు. వడ దెబ్బతో మృతి చెందిన వారికి నష్ట పరిహారం అందితే వారి కుటుంబ సభ్యులకు ఎంతో కొంత ఆసరాగా ఉంటుంది.

పి రవిబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్, ఓజిలి.

పోస్టుమార్టం తప్పనిసరి

వేసవిలో వేడి గాలుల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అనుకోని సంఘటనల వల్ల వ్యక్తి మరణిస్తే కుటుంబంలో వ్యక్తులకు నష్టపరిహారం అందుతుంది. మరణిం చిన వ్యక్తికి తప్పని సరిగా పోస్టు మార్టం నిర్వహించాల్సి ఉంటుంది. పరిహారం అందితే బాధిత కుటుంబాలకు కొంతైనా మేలు జరుగుతుంది.

డాక్టర్ జి హిమజ, ఓజిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.

మండు టెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

కలెక్టర్ కు నివేదిక పంపుతాం..

వడదెబ్బతో ఎవరైనా మరణిస్తే త్రిసభ్య కమిటీకి సమాచారం ఇవ్వాలి. వైద్యాధికారి, సబ్ ఇన్‌స్పెక్టర్ వివరాలు మాకు ఇస్తే రెవెన్యూ డివిజన్ అధికారులకు, కలెక్టర్ కార్యాలయానికి నివేదిక సమర్పిస్తాం..ప్రజలకు వడదెబ్బ పరిహారం గురించి అవగాహన ఉండాలి. ప్రజలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

తహశీల్దారు, ఓజిలి.

ఇద్దరికి డాక్టరేట్

పజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని ఆర్థిక శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థి ఎమ్ కిరణ్ కుమార్ రాజుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వియూ మాజీ రిజిస్ట్రార్, ఆర్థిక శాస్త్ర విశ్రాంత ఆచార్యులు మేడసాని దేవరాజులు మార్గదర్శకత్వంలో 'సోషియో ఎకనమిక్ కండిషన్స్ ఆఫ్ స్ట్రీట్ గార్మెంట్ వెండర్స్ : ఏ కేస్ స్టడీ ఇన్ చిత్తూరు డిస్టిక్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై సిద్ధాంత గ్రంధాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు తెలిపారు. ఇందుకు అతనికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఎమ్ కిరణ్ కుమార్ రాజు పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్‌లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. ప్రస్తుతం ఆయన తిరుపతిలోని ఎస్వి ఆర్ట్స్ కళాశాలలో ఆర్థిక శాస్త్రం అధ్యాపకులుగా, విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. ఎమ్ కిరణ్ కుమార్ రాజుకు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

అంబటి కిమీరకు

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని హోమ్ సైన్స్ విభాగపు పరిశోధక విద్యార్థిని అంబటి కిమీరకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వియూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ సైన్స్ ప్రొఫెసర్ కెవి సుచరిత మార్గదర్శకత్వంలో 'ఫార్ములేషన్, స్టాండర్డైజేషన్, అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ లాక్టోస్-ఫ్రీ మిల్క్ విత్ మిల్లెట్స్ అండ్ ఇట్స్ ఎఫెక్ట్ ఆన్ గ్రోత్ ఇన్ అల్బినో రాట్స్' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు తెలిపారు. ఇందుకు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. అంబటి మీర పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. ప్రస్తుతం ఆమె తిరుపతిలోని మహిళా విశ్వవిద్యాలయంలో డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అంబటి కిమీరకి డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

విష జ్వరాల వ్యాప్తిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

విష జ్వరాలపై అప్రమత్తంగా వుండాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: దోమ కాటు వల్ల వ్యాపించే విష జ్వరాల పట్ల ప్రజలు అప్రమ త్తంగా వుండాలని బుచ్చినా యుడు కండిగా ప్రాథ మిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డీఎన్ వెంకటేశ్వర్లు హెచ్చ రించారు. మండ లంలోని ఆలత్తూరు పంచాయతీలో సోమవారం మలేరియా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆలత్తూరులో అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. దోమకాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధి, బోధకాలు, తదితర జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పించారు. విష జ్వరాల వ్యాప్తికి కారణమైన దోమలు, వాటి లార్వాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల లార్వా నివారణకు ఇళ్లలో ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. దోమలను నివారిస్తే విష జ్వరాలను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలో ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడికి దేహశుద్ధి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

ఓ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డ యువకుడిపై స్థానికులు దేహశుద్ధికి పాల్పడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. గూడూరు రెండో పట్టణ పరిధిలోని ప్రశాంతి నగర్‌లో ఓ బాలిక పై అదే ప్రాంతానికి చెందిన యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో గమనించిన స్థానికులు యువకుడిని పట్టుకుని చెట్టు కు కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం 100 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇచ్చారని స్థానికులు తెలిపారు.

వైసిపి నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

పుత్తూరు రూరల్ మండలం వేపగుంట గ్రామం, నగరి నియోజకవర్గ పుత్తూరు వైసిపి నాయకుడు జిల్లా వైసీపీ ఎస్సి సెల్ విభాగం జిల్లా కార్యదర్శి ఏ సుదర్శనం అనారోగ్యానికి గురై గృహంలో మంచంపై ఉన్నాడు. ఆయనను పుత్తూరు వైసీపీ నాయకులు పి గోపి రాయల్, కె ఆనందబాబు సోమవారం సాయంత్రం వేపగుంటలోని సుదర్శనం నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకున్న అనంతరం సుదర్శనం నివాసానికి వచ్చాండు. సుదర్శనం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వృద్ధురాలి మెడలో బంగారు చైను అపహరణ

ప్రజాశక్తి-పుంగనూరు:

పుంగనూరు పాత బస్టాండ్‌లో ఓ వృద్ధురాలి బెంగళూరు బస్సు ఎక్కుతుండగా ఆమె మెడలో ఉన్న బంగారు చైన్ లాక్కెళ్ళారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమల మండల కేంద్రానికి చెందిన సహదేవరాజు భార్య పద్మావతమ్మ (70) ఈమె కూతురు దేవిక బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం గత నాలుగు సంవత్సరాలుగా చేస్తున్నది. పద్మావతమ్మ బెంగళూరు నుంచి సొంత పనిపై శుక్రవారం సోమలకు వచ్చినది. వచ్చిన పని చూసుకొని తిరిగి సోమవారం బెంగళూరు బయలుదేరినది. సోమల నుండి పుంగనూరు ప్రైవేట్ బస్టాండుకు వచ్చి ప్రైవేట్ బస్సు ఎక్కినది. వెనుక వైపు నుంచి ఓ దుండగుడు ఆమె మెడలో ఉన్న కేడియం బంగారు 58గ్రాములు చైను లాక్కెళ్లారు. చోరీకి గురైన చైన్ విలువ సుమారు మూడు లక్షల రూపాయలు పైన ఉంటుంది. వెంటనే పద్మావతమ్మ చైన్ చోరీకి గురి అయినదని తెలుసుకొని జరిగిన సంఘటనపై స్థానిక పోలీసులు ఫిర్యాదు చేసింది.

పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: ప్రతి నెల వృద్ధులకు, వితంతువులకు అందించే పెన్షన్ పంపిణీ ఈ నెల కూడా పెన్షన్ దారుల ఖాతాలో ప్రభుత్వం జమ చేయడంతో బ్యాంకులు, పోస్ట్ ఆఫీస్‌ల వద్ద లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు లబ్ధిదారులతో నిర్లక్ష్యంగా మాట్లాడడంతో పాటు కనీసం వారికి ప్రత్యేకమైన కౌంటర్ ఏర్పాటు చేయడం లేదని వృద్ధులు వాపోయారు. ముఖ్యంగా నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు సైతం బ్యాంక్ అధికారులు ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా క్యూలో గంటల తరబడి నిలబెట్టి నగదును అందించడంలో చాలా మంది అస్వస్థతకు గురయ్యారు. అయినా స్పందించని అధికారులు వృద్ధుల పట్ల కనికరం లేకుండా వ్యవహరించారని వాపోయారు. దీనికి తోడు సర్వర్లు కొంత మొరాయించడంతో చాలా ఆలస్యం అయ్యింది. ఈ పద్ధతిని మార్చి సచివాలయం అధికారుల ద్వారా పెన్షన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. లేకపోతే అనేకమంది వృద్ధులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వుందని ఇప్పటికైనా తమపై కనికరం చూపాలని వారు కోరుతున్నారు.

పింఛన్ల సమాచారం కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

చిన్నపాండూరు పిహెచ్‌సికి చేయూత

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: చిన్నపాండూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి సమీపంలోని హీరో మోటార్స్ పరిశ్రమ తోడ్పాటు నిచ్చింది. ఆ దశగా హీరో పరిశ్రమ సీఎస్ ఆర్ (కమ్యూనిటీ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ) నిధులు రూ.14 లక్షలతో 190 మీటర్ల మేరకు నాడు -నేడు ద్వారా నూతనం గా నిర్మించిన ఆసుపత్రి భవనంకు ప్రహరీ గోడ, గేట్లను నిర్మించారు. సోమవారం ఆస్పత్రి వైద్యులు అనిత, లావణ్య, సోమశేఖర్, ఆసుపత్రి నిర్మాణ కాంట్రాక్టరు సామర్ల హరి సమక్షంలో హీరో పరిశ్రమ ప్రతినిధులు ప్లాంట్ మ్యాను ఫ్యాక్చరింగ్ హెడ్ నిహల్ కౌల్ , ప్లాంట్ హెచ్‌ఆర్ హెడ్ మనోహర చక్రవర్తి , ప్లాంట్ పిఈ హెడ్ అనుప్ గుప్త, చీఫ్ సెక్యూరిటీ కిరణ్, సివిల్ సెక్టర్ హెడ్ ఆశిష్ కుమార్, ప్లాంట్ పీఎంఓ డాక్టర్ హర్షవర్ధన్ నూతన ప్రహరీ గోడను లాంఛనంగా ప్రారంభించారు. మొదట ప్రధాన గేటు వద్ద రిబ్బన్ కట్ చేసి ప్రహరీ గోడను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పరిశ్రమ ప్రతినిధులు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, హీరో హోండా పరిశ్రమ ప్రతినిధులను శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించి ఆసుపత్రి భద్రతకు, అభివృద్ధికి వారిచ్చిన తోడ్పాటుకు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు వైద్యం అందించే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మీ సహాయ, సహకారాలు అందించాలని కోరారు. రాత్రి వేళల్లో ఆసుపత్రి లో వైద్యం అందించేందుకు విధులు నిర్వహించే మహిళా వైద్య సిబ్బంది భద్రత ప్రశ్నార్ధకం ఉందని అందుకు సంబంధించి పరిశ్రమ నుండి రాత్రి వేళల్లో ఒక సెక్యూరిటీ గార్డెన్ ఏర్పాటు చేసి మా భద్రతకు అండగా నిలవాలని గతంలో కోరారు. వైద్యాధికారులు వైద్య సిబ్బంది పరిశ్రమ ప్రతినిధులకు వినతిపత్రం ద్వారా విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వారు పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రహరీ గోడను ప్రారంభిస్తున్న హీరో హోడా పరిశ్రమ సిబ్బంది

ఘనంగా పాశిం సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గూడూరు నియోజకవర్గం అభివృద్ధిని కోరుతూ పనిచేసే పాశిం సునీల్ కుమార్ మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఉన్నత పదవులు పొందాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రెడ్డి కోరారు. గూడూరు టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం మెప్మా పునరావస కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన ఓడి పోయిన ప్రజలకు నిరంతరం సునీల్ కుమార్ అందుబాటులో ఉన్నారని గతంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు పొంది ఆయురారోగ్యాలతో ఉండా లని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో నాయకులు, పులిమిశ్రీనివాసులు, వెంకటేశ్వ ర రాజు, శివకుమార్ , నరసింహుల నాయుడు, వెంకటేష్, శ్రీధర్, లీలావతి, కల్పనా, భారతి పాల్గొన్నారు.

పాశిం సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టిడిపి కార్యకర్తలు

నేడు ఓట్ల లెక్కింపు

సత్యవేడులో గెలుపుపై ఇరు పార్టీల ధీమా

ప్రజాశక్తి - సత్యవేడు:

గత నెల 13న ఓటర్లు ఇచ్చిన తీర్పు మంగళవారం వెలువడనుంది.. ప్రధానంగా సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపు తమదేనంటూ ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి సత్యవేడు నియోజకవర్గంలో 85.28 శాతం పోలింగ్ నమోదయింది. పోలింగ్ సరళి విషయానికొస్తే.. ఉదయం నుంచే నియోజవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో దశల వారీగా పోలింగ్ శాతం పెరుగుతూనే వచ్చింది. మండుటెండలను కూడా లెక్క చేయకుండా ఓటర్లు గంటలు తరబడి ఈ దఫా తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ నేపథ్యంలో గెలుపుపై ప్రధాన పార్టీలు ఎవరి అంచనాల వారు లెక్క కట్టుకుంటూ విజయం తమదేనని చెబుతున్నారు. వైసిపి నవరత్నాలు, ఎన్నికలకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పెద్ద స్థాయిలో చేయడం, ప్రతి ఓటరు ఓటింగ్‌కు రెండు రోజులు ముందే పంపకాలు సంతృప్తికరంగా చేశామని, దీనికి తోడు ప్రత్యర్థి అభ్యర్థిపై ఉన్న వ్యతిరేకత, టిడిపికి రెబల్ అభ్యర్థి పోరు తమకు బాగా లాభిస్తాయని వైసీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఈ కారణాల వల్ల తమ అభ్యర్థి నూక తోటి రాజేష్ సుమారు 20వేల మెజార్టీతో గెలుపు నల్లేరు మీద నడకేనని బల్ల గుద్ది చెబుతున్నారు.

టిడిపి అభ్యర్థిపై కొద్ది రోజులు అక్కడక్కడా వ్యతిరేకత కనిపించడం, కొంతమంది నాయకులు దూరం దూరంగా తిరిగారు. అన్ని సర్దుబాటు చేసుకుని ఎన్నికల గోదాలోకి దిగారు. స్థానిక నినాదం, అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత, ఆ పార్టీలోని కొందరు తెరచాటు సహాయ సహకారాలు, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల ఆకర్షణ, బాబు బహిరంగ సభ, జనసేన, బిజేపీ శ్రేణుల కలయిక, క్రాస్ ఓటింగ్ తదితర కారణాలతో టిడిపి అభ్యర్థి ఆదిమూలం గెలుపు తథ్యమని ఆ పార్టీలో వారు అంటున్నారు. మెజారిటీ మాత్రం 6 నుంచి 7వేల లోపు తప్పకుండా వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి కాంగ్రెస్, బీఎస్పీ , ఇండిపెండెంట్లు, ఇతర పార్టీలు గెలుపు తమదంటే తమదేనని ధీమా వ్యక్త పరుస్తున్నాయి.

IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 4583 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr. Manager(Law) & Authorized Officer, **...Plaintiff**
And
Sri.K.B.Sudharshan, **...Defendant**
To
Sri.K.B.Sudharshan, S/o.K.Balaiah Naidu, Aged about 37 Years, Occ: Business, R/o. H.No.8-29, Vidya Nagar Narth, Vidya Nagar, Tirupati, A.P-517502.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs. 3,25,233-25ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 10-07-2024. In case of your failure to attend before the Court on 10-07-2024 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.